క్లుప్తంగా

పంటల సాగు వివరాలు నమోదు



కోస్గి: రైతులు సాగుచేసిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ వినోద్ సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని పోలేపల్లిలో రైతుల పొలాల్ని పరిశీలించి వానాకాలంలో సాగుచేసిన పంటల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించే పంటల సాగు వివరాలను రైతు బీమా, రైతు భరోసా, పంటల బీమాకు ప్రామాణికంగా తీసుకొంటుందని, రైతులు విధిగా తమ పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సీఐగా దస్రూనాయక్



కోస్గి: స్థానిక సీఐగా పని చేసిన సోమ నర్సయ్య బదిలీ కావడంతో మల్టీజోన్-2 రేంజ్ ఆఫీస్‌లో పని చేస్తున్న సీఐ దస్రూ నాయక్ బదిలీపై గురువార స్థానిక సీఐ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. సోమ నర్సయ్య మల్టీజోన్-2 రేంజ్ ఆఫీస్‌కు సీఐగా బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలు, యువకులు, నాయకులు, అధికారులతో కలిసి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఎస్‌ఐగా పి.రాజు



దామరగిద్ద: మండల ఎస్‌ఐగా పి.రాజు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గతంలో దామరగిద్ద ఎస్‌ఐగా విధులు నిర్వహించిన వసంత నారాయణపేట వీఆర్‌కు బదిలీ వెళ్లారు. నూతన ఎస్ఐ రాజు గతంలో జోగులాంబ గద్వాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా విధులు నిర్వహించాడు. బదిలీపై దామరగిద్ద పీఎస్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ మేరకు.. ఎస్పీ నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ రాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో ఎలాంటి సమస్యలు లేకుంగా విధులు నిర్వహించాలని కోరారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

ఏపీ జితేందర్‌రెడ్డికి సన్మానం



మక్తల్: ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి, క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డికి గురువారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గవినోళ్ల గోపాల్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం హైదరాబాద్ రావడంతో ఆయనను సన్మానం చేశారు. ఆయనతోపాటు గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధన్వాడ: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో హాస్టల్‌లో పనిచేసేందుకు కేర్ టేకర్, ఏఎన్ఎం పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ అంజలిదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కేర్‌టేకర్‌కు డిగ్రీతోపాటు బీఎడ్, డీఎడ్, ఇంటర్, ఏఎన్ఎం కోర్సు చేసి ఉండాలన్నారు. మండల వనరుల కేంద్రం విద్యా శాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఈ నెల 9లోగా అందజేయాలని సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

కోస్గి: గుండుమాల్ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి స్పందన బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బ్యూలా తెలిపారు. గుండుమాల్ మండల పరిధిలోని హన్మాన్‌పల్లికి చెందిన స్పందన మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో ప్రతిభ చూపడంతో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థి స్పందనను పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం రమేష్ శెట్టి తెలిపారు. విద్యార్థులు కల్యాణి 9.8, నందిని 9.8 సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయలు అభినందించారు.

మూగ జీవాలకు సుస్తీ

- సీజనల్ వ్యాధుల బారిన గొర్రెలు
- కొత్తగడ్డితో పుర్రు రోగం
- చిత్తడితో కాలిపుండు రోగాలు
- పశువైద్యశాలలో వ్యాక్సిన్లు ఉన్నా.. ప్రైవేట్‌గా కొంటున్న కాపరులు



పుర్రు రోగం సోకిన గొర్రెను చూయిస్తున్న కాపరి

దామరగిద్ద: వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రతి ఏటా వచ్చే సీజనల్ వ్యాధులతో పశువులు రోగాల బారిన పడుతుంటాయి. మండలంలోని పశుపోషణనే జీవనాధారంగా జీవించే పశువుల కాపరులు వందలాదిగా ఉన్నారు. కాగా పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన లేకపోవడంతో గొర్రెలు, మేకలు వంటి పశువులను కోల్పోతుంటారు. తొలకరి వర్షాలకు మొలకెత్తిన పశు గ్రాసాన్ని మేయడం పుర్రు కొట్టుకోవడం మేత మేసిన శరీరానికి ఇంకక పోవడం వంటి లక్షణాలతో గొర్రెలు రోగాల బారిన పడుతుంటాయి. పశువైద్యశాఖలో మందులున్న పశువుల కాపరులకు అధికారులు అవగాహన కల్పించకపోవడమో! లేదా మండల ప్రభుత్వ ఆస్పత్రిలో దొరక్క పోవడమో తెలియదు. ప్రతి ఏటా రైతులు తమ పశువులకు అవసరమైన మందులను ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూనే ఉంటారు.

గొర్రెలకు సోకే సీజనల్ వ్యాధులు..

క్లాస్టోడియం జాతికి చెందిన సూక్ష్మ జీవులు ఉత్పత్తి చేసే విష పదార్థాల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది.

- తొలకరి వర్షాలకు పెరిగిన పచ్చి మేత మేయడంతో ఈ వ్యాధి సోకుతుంది.
- ఈ వ్యాధి సోకిన గొర్రెలు ఎలాంటి లక్షణాలు లేకుండానే హఠాత్తుగా గాలిలోకి ఎగిరి కిందపడి గిలగిల కొట్టుకొని చనిపోతాయి.
- ఈ వ్యాధి నివారణకు వర్షాకాలానికి ముందు మే నెలలో టీకాలు వేయించాలి

కాలిపుండు వ్యాధి..

ఈ వ్యాధి చిత్తడి నెలల్లో గొర్రెలు మంద తిరుగుతున్నప్పుడు బ్యాక్టీరియాలతో వ్యాధి సోకుతుంది.

- వ్యాధి సోకిన గొర్రెలకు కాళ్ల గిట్టల మధ్య ఎర్రగా కందుతుంది. అనంతరం చీము పట్టి నల్లగా కుమిలి పోతుంది.
- నొప్పి కారణంగా గొర్రెలు నడవలేని స్థితిలో గెంటుతుంది.
- వ్యాధి సోకిన గొర్రెలను మంద నుంచి వేరు చేసి పొడి ప్రదేశాల్లో నిలపాలి

నీలినాలుక వ్యాధి..

ఈ వ్యాధి వైరస్‌తో వస్తుంది, దోమకాటుతో వ్యాప్తి చెందుతుంది.

- జ్వరం ఎక్కువగా ఉంటుంది.
- గొర్రెల పెదవులు, చిగుళ్లు వాచి పెదవుల లోపల ఎర్రబడి గుల్లలు ఏర్పడుతాయి.
- పశువుల పాక అపరిశుభ్రంగా ఉండటంతో ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది.
- నివారణకు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి టీకాలు వేయించాలి.

మందులు ప్రైవేట్‌గా తెచ్చుకుంటాం



ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే గొర్రెలకు రోగాలు వస్తుంటాయి. పుర్రు రోగంతో మేత మేసిన గొర్రెలకు అంటక పోవడంతో బక్కచిక్కి పోతాయి. పుర్రు నివారణకు ప్రైవేట్ మెడికల్ షాపులో మందులు తెచ్చి తాపిస్తున్నాం. కొన్నింటికి నయమవుతుంది. కొన్నింటికి తొందరగా నయం కావడం లేదు.

\- కుర్వ భాస్కర్, మద్దెల్‌బీడ్

మందులు అందించాలి..



ప్రభుత్వ వైద్యులు గొర్రెలకు సోకే సీజనల్ వ్యాధులపై ప్రతి ఏటా అవగాహన కల్పించాలి. అవసరమైన మందులు ప్రభుత్వ పశువుల ఆస్పత్రి ద్వారా అందించి కాపరులకు ప్రయోజనం కల్పించాలి. పశువుల ఆస్పత్రికి ఏ మందులకు వెళ్లిన ఒకటి ఉంది. మరోకటి బయట తెచ్చుకొండి అంటారు. నమ్మకం లేక ప్రైవేట్ మందులను వాడుతున్నారు.

\- చంద్రప్ప, గొర్రెల కాపరి, మద్దెల్‌బీడ్

జాగ్రత్త వహించాలి..



సీజనల్ వ్యాదులపై పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి, సీజన్ వ్యాధులకు అవసరమైన సరిపడా మందులు ఉన్నాయి. రైతులు ముందస్తుగా ఆస్పత్రిలో సంప్రదిస్తే అందజేస్తాం. సీజనల్ వ్యాధుల నివారణకు మందులతోపాటు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం.

\- సబిత పశువైద్యాధికారి, దామరగిద్ద

విద్యార్థులకు ఐరన్ మాత్రలు తప్పనిసరి



ఐరన్ మాత్రలు వేస్తున్న ఏఎన్ఎం చంద్రకళ

మక్తల్: మండలంలోని చిట్యాలలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఏఎన్ఎం చంద్రకళ విద్యార్థులకు ఐరన్‌మాత్రలను వేశారు. విద్యార్థులకు పోలిక్ యాసిడ్ సప్లిమెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కౌమారదశలో ఉన్న బాలికలు, అబ్బాయిలకు రక్తహీనత ఉన్న విద్యార్థులకు మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. ప్రతి గురువారం గ్రామంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో చదువుకుంటున్న ఆరునుంచి పదోతరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఆశావర్కర్లు రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి



ధన్వాడ: మండలంలోని మందిపల్లిలో గ్రామ పంచాయతీ బోరు పైపులైన్‌పై కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గ్రామస్తులు ఎంపీడీఓ సాయి ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించడంతోపాటు ఇప్పుడు కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నారని, అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని ఆపాలని గ్రామస్తులు కోరారు. ఇందులో గ్రామస్తులు పాల్గొన్నారు.

గురుకులాల్లో కనీసవసతులు కల్పించాలి

కొత్తకోట: ప్రభుత్వం గురుకుల పాఠశాలలో అమలు చేసే కామన్ టైం టేబుల్ రద్దు చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల ఉద్యోగ ఉపాధ్యాయ ఆధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల సైదులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలు జోసెఫ్ డిమాండ్ చేశారు. గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతూ కనీస వసతులకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ నెల 2న విడుదల చేసిన టైం టేబుల్‌లో విద్యార్థులు 5గంటలకు లేచి 6 గంటల వరకు కాలకృత్యాలు తీర్చుకోవాలని సూచించారన్నారు. ఈ మేరకు కొత్తకోట సమీపంలోని వీపనగండ్ల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీనియర్ వైస్ ప్రిన్సిపల్ ఆంజనేయులు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ ఫాతిమా, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపేందర్, జ్యోతిర్మయి, లలిత, రేణుక పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించడమే లక్ష్యం



ఆత్మకూర్: ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధించడమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు అజ్జపాగ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని తిప్డంపల్లిలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించేందుకు మందకృష్ణ ఆదేశాల మేరకు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, కృష్ణయ్య, బాలకొండ, మురళి, విష్ణు, శేఖర్, గట్టన్న, కుర్మన్న, తిరుపతి, వెంకటేష్, చంద్రయ్య, రమేష్, ఆంజనేయులు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ధన్వాడ: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని, వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జోనల్ సూపర్ వైజర్ కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కొండాపూర్‌లో వైఆర్‌జీ కేర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, హెచ్ఐ, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. 15 నుంచి 60సంవత్సరాల వారు హెచ్ఐ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఆశా వర్కర్ అంజిలమ్మ, అంగన్‌వాడీలు సుగుణ, అంజమ్మ పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి సన్మానం



కోయిల్‌కొండ: మండలంలోని అభంగపట్నం ఎంపీటీసీ సభ్యురాలు చింతకింది పద్మమ్మ పదవీ కాలం ముగియడంతో గురువారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామంలోని ప్రజలకు సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ సంపూర్ణం



పేటలో తరగతులు బహిష్కరిస్తున్న నాయకులు



మక్తల్‌లో ..



మద్దూరులో ..

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా గురువారం వివిధ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై నిరసన వ్యక్తం చేస్తూ పాఠశాలలు, కళాశాలల తరగతులను బహిష్కరించారు. ఈమేరకు.. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ. నీట్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పవన్, మహేష్, రాజు, సురేష్, లక్ష్మణ్, సలీం, ప్రశాంత్, శ్రీకాంత్, గణేష్, రాము, విక్టర్‌పాల్, నరేష్, భాను, శివ పాల్గొన్నారు.

మక్తల్: దేశవ్యాప్తంగా వామపక్షాల విద్యార్థి సంఘాలు ఇచ్చిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా పాఠశాలల బంద్‌ను ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు బంద్ నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని విద్యాసంస్థలను మూసివేయించి పాఠశాలలను బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు భాస్కర్, పృథ్వీరాజ్, హర్షవర్ధన్, శివ, మణికత, నాగరాజు, నర్సింహ, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: నీట్ పరీక్షలో జరిగిన అక్రమ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో గురువారం దేశ వ్యాప్తంగా చేపట్టిన పాఠశాలల బంద్ మండలంలో విజయవంతమైంది. ఈ మేరకు పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి గౌస్ సంఘ నాయకులతో కలిసి పాఠశాలలను మూయించారు. ప్రభుత్వం ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు నష్ట పరిహారం అందించడంతోపాటు ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్దూరు: నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో గురువారం విద్య సంస్థలను బంద్ నిర్వహించారు. ఈ మేరకు.. నాయకులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి బంద్ చేయించారు. అలీ, అంజి, కాశీ, రాజు, వెంకట్ పాల్గొన్నారు.

మాగనూర్: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్న నర్సింహ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నయ్యూం, మహేష్, అమ్రేష్, అనిల్, ఆకాష్, సూర్యప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేష్, కురుమూర్తి, హన్మంతు, నర్సింహ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఏ. తిరుపతిరెడ్డి

మద్దూరు: మండలంలోని లబ్ధిదారులకు గురువారం కొడంగల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ. తిరుపతిరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 32మంది లబ్ధిదారులకు రూ.23లక్షల 40వేల 500 రూపాయల చెక్కులను అందజేసినట్లు కడా అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, మండల పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, చెన్నప్ప, సంజీవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డిఫెన్స్ కౌన్సిల్ దత్తాత్రేయ

మాగనూర్: మండల పరిధిలోని నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయం వద్ద కస్తుర్బా బాలిక పాఠశాలలో గురువారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ నాగేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులు న్యాయ వ్యవస్థలో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో నేరాల వైపు వెళ్లేందుకు ఇష్టపడరని తెలిపారు. చాలా వరకు గ్రామాల్లో పోలీస్ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. వీటితో పాటు బాల్యవివాహాలు గ్రామాల్లో ఎక్కువగా జరుగుతుంటాయని అటువంటి వాటిని మనం పూర్తిస్థాయిలో వ్యతిరేకించాలన్నారు. ఈ ర్యాగింగ్ సంబంధించి ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే టోల్‌ఫ్రీ నంబర్ 180018 0522 కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ దత్తత్రేయ, ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, చిల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ఎస్ఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి



మరికల్: మండల కేంద్రంలోని యువక మండలి భవనంలో గురువారం స్వామి వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభ్యులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజేష్, మల్లయ్య, కృష్ణయ్య, రఘు, సురేందర్‌రెడ్డి, సూర్యప్రకాష్, రవి, రాములు, నారాయణ, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం



ఆత్మకూర్‌లో ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

ఆత్మకూర్: పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులు నిత్యం గ్రామాల్లో పర్యటించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా జీసీడీఓ బీరం సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియడంతో గురువారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఆత్మకూర్ మండల ప్రత్యేకాధికారిగా సుబ్బారెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడారు. సీజనల్ వ్యాదులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, గ్రామస్తులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ నర్సింగ్‌రావు, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

పెద్దమందడి ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్

పెద్దమందడి ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్



పెద్దమందడిలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి ఎంపీపీ రఘుప్రసాద్ పదవీ కాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వేణుగోపాల్ జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న స్థానిక సంస్థల పదవి కాలం పూర్తయినందున కలెక్టర్ ఆదేశానుసారం పెద్దమందడి మండల ప్రత్యేక అధికారిగా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు అభివృద్ధి కోసం సహకరించాలని ఆయన కోరారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌కు ఎంపీడీఓతో పాటు కార్యాలయ సిబ్బంది పూల మొక్క ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఏఎస్ఐ రాజేష్ సేవలు మరువలేనివి

నర్వ: మండలంలో గత ఐదేళ్లుగా ఏఎస్ఐగా ప్రజలకు సేవలందిస్తున్న రాజేష్ సేవలు మరువలేనివని మండల నాయకులు అన్నారు. గురువారం బదిలీపై అడ్డాకులకు వెళ్తున్న ఆయనను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలను కాపాడుతూ... అందరితో ఆప్యాతగా ఉంటూ సమస్యల పరిష్కారంలో చొరవచూపే ఆయన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కురుమయ్య, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

అమరచింత: ప్రకృతి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులోని ధ్యాన మందిరంలో గురువారం వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. వాతవరణంలోని కాలుష్యం నివారించాలంటే మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్



పేటలో పీఎస్‌లో బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు



కోస్గిలో..

నారాయణపేట రూరల్: జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన టీఎస్‌పీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా బీజేవైఎం, ఏబీవీపీ నాయకులను పేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం వారిని ఇంటి నుంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సమయం ఇవ్వాలని, గ్రూప్- 1, 2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఏబీవీపీ నాయకుడు భరత్, బీజేవైఎం నాయకులు కార్తికేయ, వరప్రసాద్, అశోక్, చైతన్య, ఆకాష్, అనిల్ ఉన్నారు.

కోస్గి: గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో నేడు బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా గురువారం స్థానిక బీజేవైఎం నాయకులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ బాల వెంకటరమణ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో బీజేవైఎం మండల నాయకులు శ్రీకాంత్ గౌడ్, శివ, శ్రీకాంత్ ఉన్నారు.